క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు


డాక్టర్ ఆదిమూలపు సురేష్


దద్దాల నారాయణ యాదవ్

సింగరాయకొండ/కనిగిరిరూరల్: ముస్లిం సోదరులకు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం సోమవారం నిర్వహించుకునే రంజాన్ (ఈద్-ఉల్- ఫితర్) పండుగను నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అల్లాహ్ కృపతో సర్వమానావళి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విరజిల్లాలని ఆకాంక్షించారు. అలాగే పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ) ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం, గోపూజ


మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ పంచామృతాలతో స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

ఎంఈఓ బాలాజీకి ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న ఎంఈఓ 2 బాలాజీ

టంగుటూరు: ఉగాది పండుగను పురస్కరించుకొని ఒంగోలులోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో ఎంఈఓ- బాలాజీ కవి సమ్మేళనంలో పాల్గొని మంత్రి స్వామి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

మాలల ద్రోహి మంత్రి స్వామి


తూర్పు నాయుడుపాలెంలో ఉగాది పురస్కారాలు అందజేస్తున్న నాయకులు

టంగుటూరు: మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాలల ద్రోహి అని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉగాది రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం తూర్పునాయుడుపాలెంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ విధానాన్ని తప్పుపట్టారు. సుప్రీం కోర్టు తీర్పును కూడా చదవకుండా వర్గీకరించడానికి ప్రయత్నం చేస్తున్నారంటే సిగ్గు చేటన్నారు. రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుళ్లిబిల్లి అశోకబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి దళితుల మధ్య తగాదా పెట్టి తమాషాలు చూస్తుందని మండిపడ్డారు. డాక్టర్ దాసరీ చెన్నకేశవులు మాట్లాడుతూ రాష్ట్రంలో మాల ఎమ్మెల్యేలు, మంత్రులు కేవలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్లు ఉపయోగించకోవడానికే గానీ మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం 200 మందికి ఉగాది పురస్కారాలు అందజేశారు. మేజర్ చంద్రకాంత్, పగడాల రాజారావు, పండు అశోక్ కుమార్ , బాబురావు తుమ్మల ఫ్రాన్సిస్, రమణకుమారి, మేరీ, జోనీ కుమారి, చిట్టిబాబు, వెంకట్ మేడిది రవి, శ్రీకాంత్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరులో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం


వర్మీ కంపోస్టు ఉండాల్సిన చోట పరుపు, దిండ్లు


కేంద్రం ఆవరణలో పడి ఉన్న విద్యుత్ ఆటోలు, రిక్షాలు

ఉన్నా ఉపయోగం సున్నా..!

- అలంకారప్రాయంగా చెత్త సేకరణ సంపద కేంద్రాలు
- గ్రామాల్లో సేకరిస్తున్న చెత్తకు నిప్పు
- పంచాయతీల ఆదాయానికి గండి
- పొగతో ప్రజలకు ఇబ్బందులు


టంగుటూరులో జాతీయ రహదారి పక్కనే చెత్తకు నిప్పు

టంగుటూరు: ప్రభుత్వం ప్రతి నెలలో మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అని అధికారులు ఆ ఒక్క రోజు తూతూమాత్రంగా నిర్వహిస్తున్నారు. మిగిలిన రోజులు ఎక్కడి చెత్త అక్కడే తిష్ట వేస్తోంది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త నుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వాలు మొతుకున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు ఆ మండలాల్లో పలు గ్రామాల్లో ఇంటింటా వ్యర్థాలు సేకరించేందుకు హరిత రాయబారులను నియమించి కార్యాచరణ రూపొందించారు. చెత్త సంపద కేంద్రాలపై మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో రూ. లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రతి ఊరిలో ఎక్కడికక్కడ రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను ఎక్కడికీ తరలించకుండా చెత్తకు నిప్పు పెట్టి దులుపుకుంటున్నారు. మండలంలోని 18 గ్రామాల్లో 14 చెత్త సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. 2 కేంద్రాలకు మరమ్మతులు చేయాల్సి ఉండగా 2 కేంద్రాలకు స్థల సేకరణ చేయాల్సి ఉంది. మండలంలో 57 మంది గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు.

పొగతో ప్రజలకు అగచాట్లు

మండలంలోని జమ్ములపాలెం, టంగుటూరు, తూర్పునాయుడుపాలెం, కందులూరు, తదితర గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాల్లో వినియోగంలో లేక కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి నిప్పు పెడుతున్నారు. దీంతో వ్యాపిస్తున్న పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు టంగుటూరు కేంద్రం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

దృష్టి పెడితే ప్రయోజనం .....

గత ప్రభుత్వంలో చెత్త సంపద తయారీ కేంద్రాలకు చేరిన వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి ఎరువు తయారు చేసేవారు. దీంతో పంచాయతీలకు కొంతమేరకు ఆదాయం సమకూరేది. అయితే కూటమి ప్రభుత్వంలో అధికారుల పర్యవేక్షణ కొరవడంతో లక్ష్యం నీరు గారిపోయింది. ఇప్పటికైనా రూ. లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకోస్తే పంచాయతీలకు ఉపయోగకరంగా ఉంటుంది.

రూ.లక్షలు ఖర్చు చేసి నిరుపయోగంగా..

మండలంలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో గ్రామాల్లో మందుబాబులకు నివాసాలుగా మారాయి. గ్రామాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి, కొన్నిచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒక్కో కేంద్రానికి సుమారు రూ. 3.50 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వెచ్చించి నిర్మించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై చొరవ తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించాలని, చెత్త నుంచి ఆదాయం పెంచుకొని ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

చెత్తకు నిప్పు పెడితే చర్యలు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తయిన ప్రాంతాల్లో వాటిని వినియోగంలోకి తీసుకురావాలని చెప్పాం. ఇప్పటికే దీనిపై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. హరిత రాయబారులు తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి. సంపద కేంద్రాలు నిర్వహణలో కానీ, చెత్తకు నిప్పు పెడితే చర్యలు తీసుకుంటాం.

– సుబ్బారావు, ఈఓఆర్డీ

సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలి:



చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు షెడ్లని నిర్మించడం బాగుంది. అయితే ఇవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి. వర్మీకంపోస్టును తయారు చేసి స్థానికంగా ఉండే రైతులకు విక్రయించడం ద్వారా పంచాయితీలకు ఆదాయం వస్తే పంచాయతీ అభివృద్ధికి ఖర్చు పెట్టాలి.

– బుర్రా అంకరాజు, కొణిజేడు ఎంపీటీసీ

22 మందికి వైద్య పరీక్షలు



ఇంటింటికి వైద్యం కార్యక్రమంలో వైద్య సిబ్బంది

వలేటివారిపాలెం: మండలంలోని చెర్లోపాలెం గ్రామంలో ఇంటి వద్దకే వైద్యం కార్యాక్రమంలో భాగంగా వలేటివారిపాలెం వైద్యాధికారి డాక్టర్ మణిదీపిక 22 మందికి ఆదివారం వైద్యపరీక్షలు చేసినట్ల ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధులు, చిన్న పిల్లలకు ఇంటింటికి వెళ్లి చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది వేసని కాలంలో ఎండలు విపరీతంగా ఉంటాయని బాలింతలు , పిల్లలు, వృద్ధులు బయట తిరగవద్దని ఆమె తెలిపారు. మజ్జిగ, జావా లాంటి పానియాలు తీసుకోవాలని సూచించారు. అలాగే నీరు ఎక్కువ తీసుకోవాలని తెలిపారు. కార్యాక్రమంలో ఆమె వెంట సీహెచ్‌ఓ శివరామయ్య, ఏఎన్ఎమ్ రాజేశ్వరి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సేవా కార్యక్రమాలు


ఆదిమూలపు సురేష్‌ను సత్కరిస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వసంతరావు


భక్తులకు సేవా కార్యక్రమాలు చేస్తున్న సహజానంద హైస్కూల్ సిబ్బంది

కొండపి: మండలంలోని జాళ్లపాలెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా వైఎస్సార్ సీపీ నేతలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొండపి జెండా చెట్టు సెంటర్‌లో పార్టీ బీసీ సెల్ నాయకుడు వీర వసంతరావు ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. బొక్కిసం సుబ్బారావు, వైస్ ఎంపీపీ కోటరాజు, శేఖర్ రెడ్డి, కోర్నెలు, మహేష్, వినోద్, మధుసూదన్ రావు, చందు, రవి పాల్గొన్నారు. మిట్టపాలెంలో ఉపసర్పంచ్ మాలకొండయ్య ఆధ్వర్యంలో అల్పాహారం, మంచినీళ్లు పంపిణీ చేశారు. పెద్దకండ్లగుంటలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ గర్నెపూటి రమేష్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేశారు. జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, బొక్కిసం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సహజానంద ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున కరస్పాండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు వెజిటేబుల్ పలావ్, మజ్జిగ, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించండి


శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

సింగరాయకొండ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండల పాస్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాస్టర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఇటీవల కాలంలో క్రైస్తవులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రవీణ్ పగడాల మృతిపై నిజాలు నిగ్గు తేల్చి, భవిష్యత్‌లో క్రైస్తవులపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాకల రోడ్డు సెంటర్ నుంచి కందుకూరు రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. పాస్టర్ అశోక్, ఉపాధ్యాయుడు విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

ఉషస్సుల ఉగాది


ప్రత్యేక అలంకరణలో కామేపల్లి పోలేరమ్మ


ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి


శానంపూడి పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో


కోదండరామ స్వామి వారి పల్లకి సేవ


చెన్నిపాడు సంగమేశ్వరంలో పంచాంగాన్ని చూపుతున్న అర్చకులు


వల్లూరమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం


హుసేన్‌రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఉగాది పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లో ప్రజలు కొత్త దుస్తులు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చెన్నిపాడు సంగమేశ్వరం దేవాలయంలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణ నిర్వహించి ఉగాది పచ్చడిని పంచారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో విశ్వావసునామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ, కురిమేటి సుబ్రమణ్యంలు పంచాంగ శ్రవణంలో భాగంగా రాశిఫలాలు వివరించారు. నూతన పంచాంగాలను ఆవిష్కరించి భక్తులకు పంపిణీచేశారు.ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, వెంకట్రావు, భక్తులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. శానంపూడిలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించి భక్తులు తెచ్చిన 108 ప్రసాదాలు పంపిణీ చేశారు. చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు.

టంగుటూరు: విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ రమేష్ ఆధ్వర్యంలో అర్చకులు పంచాగ శ్రవణం వినిపించారు. పొందూరు, జమ్ములపాలెంలోని సీతా రామచంద్రస్వామి ఆలయంలో పంచాగ శ్రవణం అనంతరం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పామూరు: విశ్వావసునామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను పామూరుతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. పామూరులోని రుక్మిణి సత్యభామ సమేత మదన వేణుగోపాల స్వామి ఆలయంలో, సత్యనారాయణస్వామి ఆలయంలో, మహాలక్ష్మి ఆలయం, బ్రహ్మంగారి ఆలయంలో అర్చకులు విశిష్టపూజలు నిర్వహించారు. అర్చకులు నిర్వహించిన పంచాంగశ్రవణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మం గారి ఆలయం వద్ద భక్తులకు ఉగాదిపచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరసింహారావు, ప్రసాద్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలో ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంట పచ్చని మామిడి ఆకుల త్వారణాలతో కళకళాడాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు.

వీసీపల్లి: విశ్వావసునామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెదయిర్లపాడు మల్లేశ్వర స్వామి ఆలయంలో పలుకూరి సుబ్బారావు శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. పాడిపంటలు బాగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): ఉగాది పర్వదినం సందర్భంగా కామేపల్లి పోలేరమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని కె.బిట్రగుంట, జరుగుమల్లి, తూమాడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పామూరు: విశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది సుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలపార్టీ అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన హుసేన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, ఎస్టీసెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, మారం మాలకొండారెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: తెలుగు వారి తొలి పండుగ ఉగాది వేడుకలను కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి గుడి, కోదండరామ స్వామి, వీరాంజనేయస్వామి, అభయాంజనేయ స్వామి, సాయిబాబా గుడి, తదితర చోట్ల ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను అలరించింది. ఆలయ కమిటీ నాయకులు విజేతలకు బహుమతులు అందచేశారు.

శంఖవరంలో భారీ అన్నదానం

మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఉగాది పండుగ పురస్కరించుకుని విశిష్ట పూజలు చేశారు. కోదండరామ స్వామి పల్లకి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దాత పల్లేటి తిరుపాలురెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నాయకులు పల్లేటి మధుసూదన్ రెడ్డి, వరా శింగారెడ్డి, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, ముత్తుముల రామసుబ్బారెడ్డి, గుండా సుధకర్, బోయళ్ల వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, మూలే రమణారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి పర్యవేక్షణలో వివిధ ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.దేవస్థానంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు రామనబోయిన శ్రీనివాసులు, నక్కా రామకృష్ణ, పసుపులేటి అరుణోధర్, ఏఎంసీ మాజీ డైరక్టర్ బొట్టు శ్రీను, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచారం కార్యదర్శి దాదిరెడ్డి మాలకొండారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారిని ఘనంగా సన్మానించారు.

మర్రిపూడి: ఉగాదిని పురస్కరించుకొని స్థానిక శివవిష్ణు దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. వేదపండితులు గంగ్రకోట శ్రీనివాసశర్మ పంచాగంను చదివి వినిపించారు.


నారాయణస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

పొంగళ్ల మహోత్సవంలో దద్దాల


ప్రత్యేక పూజల్లో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: మండలంలోని బగడులేరు, ఎర్ర ఓబనపల్లి గ్రామాల్లో జరిగిన వద్దిరాజు గురప్పుడు స్వామి పొంగళ్ల మహోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ స్వామికి విశిష్ట పూజలు చేశారు. స్వామి వారి ఆశీస్సులతో అందరికి ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామస్తులు, కమిటీ నాయకులు, పార్టీ శ్రేణులు దద్దాల నారాయణ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ వివిధ విభాగాల జిల్లా, నియోజకవర్గ నాయకులు పల్నాటి భాస్కర్‌రెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, గోబ్బిళ్ల శ్రీను, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, చింతం శ్రీను, పాపన బోయిన పెద్ద ఓబులు, ఎంపీటీసీ కోటమ్మ, నాగేశ్వరరావు, పాంకం చిన యోగి, రమణమ్మ, నాగరాజు, గురవయ్య, పెద్ద యోగి, మేకల వెంకటేశ్వర్లు, పోలయ్య, శ్రీను, ఆవులరాజు, మోరా రామిరెడ్డి, ప్రభుదాస్, రవీంద్ర, బాలగురవయ్య, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఐక్యంగా అడ్డుకుందాం

కనిగిరిరూరల్: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు దేశ లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థకు పెను ప్రమాదమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ యాసీన్ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. దేశ, లౌకిక, ప్రజా స్వామిక వ్యవస్థలను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ గత పదేళ్లుగా ముస్లిం మైనార్టీలపై ప్రత్యక్ష దాడులకు పాల్పడుతుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు వక్ఫ్ సవరణ బిల్లుపై తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు, గుజ్జుల బాలిరెడ్డి, ఎస్‌కే ఖాశింపీరా, వలి, ఎస్‌కే బాషా పాల్గొన్నారు.